క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఎన్నికల ప్రచారం

రంపచోడవరం/దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంత బాబు) గురువారం దేవీపట్నం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి గంగంపాలెం ఆర్అండ్ఆర్ కాలనీ, మూలపాడు ఆర్అండ్ఆర్ కాలనీ, గానుగులగొంది, నాగ్లపల్లి కాలనీ, పోతవరం, పెనికిలపాడు కాలనీ, చిన్నారిగండి, దేవారం, పోతుకొండ, శరభవరం, ఉప్పయ్యపాలెం, కమలంపాలెం కాలనీల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు హాజరు కావాలని తెలిపారు.అలాగే ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రంపచోడవరం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. గాంధీనగరం కాలనీ నుంచి ఎన్నిక ప్రచారం ప్రారంభిస్తారన్నారు. రంపచోడవరం, సిరిగిందలపాడు, ఐ.పోలవరం జంక్షన్ మీదుగా వెలమలకోట వరకు ఎన్నికల ప్రచారం జరగనున్నట్టు తెలిపారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



సాయినగర్‌లో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని పలుచోట్ల బోరుబావుల్లో నీరు అడుగంటడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో అధికారులు తక్షణమే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ తీసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుక్మాంగరాజు చెప్పారు.

గిరిజనేతరుల నిర్మాణాలపై ఫిర్యాదు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రభుత్వ భూములను అక్రమించి షాపులు నిర్మించి అద్దెలకిస్తున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు రెవెన్యూ, పంచాయితీ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ నాయకుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు చెండా లోహితాసు మాట్లాడుతూ గిరిజన చట్టాలను అతిక్రమిస్తున్న గిరిజనేతరులపై ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని, బతుకుతెరువుకు వచ్చి సొంతంగా షాపులు, ఇళ్లు నిర్మించి, అద్దెలకు ఇచ్చే స్థాయికి ఎదుగుతున్నారని, అటువంటి గిరిజనేతరులపై కేసులు నమోదు చేయాలని, గిరిజన చట్టాలను రక్షించాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



ఒన్నాది కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామానికి చెందిన ఏపీఎండీసీ ఉద్యోగి కిల్లో ఒన్నాది మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం గ్రామానికి వెళ్లి ఒన్నాది మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు పూర్ణ, రఘునాథ్, సీతారాం, రఘు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నూకాలమ్మ పండుగ

సీలేరు: సీలేరు పవర్‌హౌస్ వద్ద వెలిసిన నూకాలమ్మ తల్లి ఆలయంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



జోలాపుట్టు.. అభివృద్ధి అదిరేట్టు

- గ్రామాల్లో మారిన రూపురేఖలు
- రూ.32 కోట్లతో అభివృద్ధి పనులు
- మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం
- గిరిజనుల హర్షాతిరేకాలు



లబ్బూరు గ్రామంలో బీటీ రోడ్డు



జోలాపుట్టులో బాలికల వసతి గృహం

ముంచంగిపుట్టు : ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం వహించడంతో అభివృద్ధిలో వెనకబడింది. పంచాయతీ కేంద్రమైన మౌలిక సదుపాయాలు శూన్యంగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జోలాపుట్టు పంచాయతీలోని రూపురేఖలు పూర్తిగా మారాయి. ప్రతి గడపలో నవరత్న వెలుగులు ప్రకాశిస్తున్నాయి. నాడు–నేడు నిధులతో పేద కుటుంబాల పిల్లలకు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు కొత్త సొబగులు అద్దుకున్నాయి. రహదారులు బాగుపడ్డాయి. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు మెరుగుపడ్డాయి. ఎటువంటి లంచాలు లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయి. సీఎం జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబం బాగుపడింది. జోలాపుట్టు పంచాయతీలో నాడు–నేడు, గడప గడపకు, జెడ్పీ, ఎంపీపీ, ఎంపీటీసీ, పంచాయతీల నిధులు సుమారు రూ.32 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ బజ్జింగి కమలలు పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఎన్నడులేని విధంగా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించ గలిగారు.

జోలాపుట్టు పంచాయితీలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన నగదు

పథకం	లబ్ధిదారులు	జమ అయిన నిధులు
వైఎస్సార్ చేయూత	729	రూ.87,41,250
వైఎస్సార్ పెన్షన్	2371	రూ.66,75,400
అమ్మ ఒడి	1405	రూ.48,93,900
వైఎస్సార్ రైతు భరోసా	2848	రూ.10,50,97,500
విద్యా దీవెన, వసతి దీవెన	318	రూ.18,70,000
వైఎస్సార్ వాహనమిత్ర	47	రూ.4,70,000
వైఎస్సార్ ఆసరా	1980	రూ.28,62,890

జోలాపుట్టు పంచాయతీలో అభివృద్ధి పనులు

- జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో నాడు–నేడు ద్వారా రూ.2.40కోట్లతో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా బాలిక వసతి గృహం నిర్మించారు.దీంతో ఎన్నో ఏళ్లగా బాలికలు ఎదుర్కొంటున్న వసతి సమస్య తీరింది.
- మోంజపుట్టు గ్రామంలో రూ.4.60లక్షలతో 110 మీటర్ల సీసీ రోడ్డును నిర్మించారు.
- కులబీరు గ్రామంలో రూ.1.65లక్షలతో డ్రైనేజీని ఏర్పాటు చేశారు.
- బొంద్రుగూడ గ్రామంలో రూ.2.60లక్షతో డ్రైనేజీను ఏర్పాటు చేశారు.
- జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో రూ.2లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు.
- లబ్బూరు గ్రామంలో రూ.1.14కోట్లతో బీటీ రోడ్డు, రూ.5లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు, రూ.2లక్షలతో డ్రైనేజీ నిర్మించారు.
- జప్పారు గ్రామానికి రూ.1.31కోట్లతో బీటీ రోడ్డును వేశారు.
- లబ్బూరు గ్రామ సమీపంలో రూ.13కోట్లతో ఏకలవ్య పాఠశాల నిర్మాణం పూర్తి అయింది. ఎన్నికలు అయిన వెంటనే ప్రారంభం కానుంది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఏకలవ్య పాఠశాల

- జోలాపుట్టు, లబ్బూరు, బోంద్రుగూడ, జప్పారు గ్రామాల్లో సెల్‌టవర్లు ఏర్పాటుతో సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది.
- జోలాపుట్టు పంచాయతీలో రూ.43.60వేలక్షలతో సచివాలయం, రూ.23.96లక్షలతో ఆర్‌బీకే, రూ.17.95లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలు జరుగుతున్నాయి. 80శాతం వరకు పనులు పూర్తయ్యాయి.
- నాడు -నేడు ద్వారా లబ్బూరులో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు రూ.45లక్షలతో మౌలిక వసతులు కల్పించారు.
- జోలాపుట్టులో ఎంపీపీ పాఠశాలకు నాడు–నేడు నిధుల ద్వారా 40 లక్షలతో భవనాలు, సౌకర్యాలు కల్పించారు.
- బోంద్రుగూడలో నాడు–నేడు నిధులు రూ.12లక్షలతో ఎంపీయూపీ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించారు.
- జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు జంక్షన్ నుంచి జోలాపుట్టు పంచాయతీ కేంద్రం వరకు రూ.6కోట్లతో రోడ్డు నిర్మించారు.



బోంద్రుగుడలో సీసీ రోడ్డు, డ్రైనేజీ

ప్రగతి పథంలో గ్రామాలు



జోలాపుట్టు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. గ్రామాలన్నీ ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయి. జగనన్న ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకే అందుతున్నాయి. పంచాయతీ ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు.

– డి.నీలకంఠం, సర్పంచ్, జోలాపుట్టు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

జగనన్న పాలన ఆదర్శనీయం



గతంతో పోలిస్తే పంచాయతీ అభివృద్ధి బాగుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం కలిగింది. సచివాలయం వ్యవస్థ ద్వారా అన్ని పనులు పంచాయతీ స్థాయిలోనే అయిపోతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లి అవస్థలు పడే రోజులు పోయాయి. జగనన్న చేస్తున్న ప్రజా పాలన ఎంతో ఆదర్శనీయం.

– ఎస్.గంగాధర్, జోలాపుట్టు, ముంచంగిపుట్టు మండలం

ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్సార్‌సీపీకే పట్టం కడదాం

ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్



లబ్బర్తి జంక్షన్ వద్ద ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: ప్రజల సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలిచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కడదామని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండలంలోని నెల్లిమెట్ల కాలనీ, లబ్బర్తి, లాగరాయి, కింర్ర, తాళ్లపాలెంలలో ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేశారన్నారు. చేసిన వాగ్దానాలు, హామీలను అమలు చేసిన ప్రభుత్వం మన ప్రభుత్వం ఒక్కటే అన్నారు. ప్రతిపక్షాలు మోసపూరిత వాగ్దానాలు చేస్తారని, పట్టించుకోవద్దన్నారు. ఏనాడైనా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టో అమలు చేశారా అని అడిగారు. మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో పేదల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్టు చెప్పారు.సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్లుగా అమలు చేసిన ప్రభుత్వం మనదేనన్నారు. పార్టీలకు అతీతంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి ప్రజల ముంగిటకే ప్రజాపాలన తీసుకొని వచ్చారన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకొని జగనన్నను మరోసారి సీఎంను చేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, ఆగూరి శుభలక్ష్మి, మిరియాల సత్యవతి, గణలక్ష్మి, దాసరి నాగేశ్వరరావు, తొంట ఆదిరాజు, సవెరల చంద్రుడు, సత్యనారాయణ, బుజ్జమ్మ ఎంపీటీసీలు గంగదుర్గ, నిర్మలదేవి, కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, నాయకులు కనిగిరి దుర్గాప్రసాద్, వీరబాబు, సత్యనారాయణ, చీడిపల్లి శాంతకుమారి, కుశరాజు, అర్జున్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే గిరిజనుల అభ్యున్నతి



ఎర్రగొప్పలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ సన్యాసిదొర



కరాయిగూడలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి తదితరులు



కామయ్యపేటలో గిరిజనులతో పార్టీ శ్రేణులు

జి.మాడుగుల: సంక్షేమ ప్రధాత జగనన్నను ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకుందామని, వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర పిలుపునిచ్చారు. మండలంలో పెద్దలువ్వాసింగి పంచాయతీ ఎర్రగొప్పు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు, గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసి అర్హులైన లబ్ధిదారులకు అవినీతికి తావులేకుండా నేరుగా బ్యాంక్ అకౌంట్లలోనే డబ్బులు జమచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. రాష్ట్రం మరింత పురోగాభివృద్ధి, అవినీతి రహిత పాలన తీసుకురావటానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటు చేసి గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు సత్యనారాయణ, సన్యాసిపడాల్, రమణబాబు, నీలకంఠం, వార్డు సభ్యుడు అబ్బాయిదొర, సచివాలయ కన్వీనర్లు పండుదొర పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని కొనవురం పంచాయతీ కరాయిగుడ, అత్తిమల, కితలంగి, బోందుగూడ, కొనపురం గ్రామాల్లో ఎంపీపీ శెట్టి నీలవేణి ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, సర్పంచ్‌లు జి.అప్పలమ్మ, కె.సింహాద్రి, జేసీఎస్ కన్వీనర్ నవీన్, రఘునాథ్, డొంబు, మధుసూదన్ పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని తీగలవలస, తడిగిరి పంచాయతీల్లో కామయ్యపేట, ఆమురు, సరళం, బిజ్జపల్లి, గాలిపాడు, ఓలుబెడ్డా, పంతలచింత, బొడ్డాపుట్టు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంబిడి చిన్నబ్బి, సర్పంచ్‌లు బేసు, సాంబ, ఎంపీటీసీలు కొర్ర నాగరాజు, భీమలింగేశ్వరరావు, నాయకులు ధర్మయ్యదొర, రాజారావు, మత్స్యలింగం, పద్మారావు, మహేష్, చిన్నేశ్వరరావు, రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

110 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ హారిక

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం 110 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 26 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్యసేవలతో పాటు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులందరికి భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది, గైనికాల్జిస్టు డాక్టర్ హారిక పాల్గొన్నారు. అలాగే మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో 62 మంది గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

కిల్కారీ సేవలపై అవగాహన

ముంచంగిపుట్టు: గర్భిణులు, బాలింతలు కిల్కారీ మొబైల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ అన్నారు.మండలంలో గల కిలగాడ పీహెచ్‌సీలో బుధవారం మొబైల్ కిల్కారీ సేవల పోస్టర్‌ను గర్భిణులు, బాలింతల సమక్షంలో వైద్య సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ కిల్కారీ సేవలో భాగంగా గర్భిణులు ఒక ఏడాది వరకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై మొబైల్ ఆడియో రూపంలో అవగాహన కల్పిస్తారన్నారు. వాటిని క్రమం తప్పకుండా పాటించాలన్నారు. మహిళలు గర్భవతి అయిన వెంటనే సంబంధించిన పీహెచ్‌సీ ఏఎన్ఎం ద్వారా వారి ఫోన్ నెంబర్లను కిల్కారీ సేవలకు అనుసంధానం చేస్తారని చెప్పారు. ప్రతి గర్భిణి, బాలింతలకు కిల్కారీ సేవలు పూర్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కిలగాడ పీహెచ్‌సీలో కిల్కారీ సేవల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

యువత అన్ని రంగాల్లో రాణించాలి



అన్నవరంలో గిరజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

సీలేరు: గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో అన్నవరం గ్రామంలో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గ్రామస్తులందరూ కలిసి పోలీస్ శాఖకు సహకరించాలని ఎటువంటి గొడవలు, ఘర్షణలు చోటుచేసుకున్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరు కూడా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు. యువత ఉన్నత చదువుపై శ్రద్ధ చూపించి ప్రభుత్వం, ప్రైవేటు రంగాల్లో రాణించాలన్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అన్యాయం చేసింది

అరకులోయటౌన్: అరకు నియోజకవర్గంలో కాంగ్రెస్ గడ్డుకాలంలో ఉన్నప్పుడు అహర్నిశలు శ్రమించి పార్టీకి జీవం పోసిన తనకు అధిష్టానం అన్యాయం చేసిందని పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్ పర్సన్, అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి శాంత కుమారి అన్నారు.

ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసానని, పార్టీ అధిష్టానం తన కష్టాన్ని గుర్తించకుండా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా షర్మిలరెడ్డి ఎన్నికైన తరువాత పార్టీలో చేరిన శెట్టి గంగాధరస్వామికి ఎలా టిక్కెట్ కేటాయిస్తారని ప్రశ్నించారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా తానే బరిలో ఉంటానని, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. నాయకులు ప్రేమ్ కుమార్, గంగాధర్, కోమటి, వెంకట్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శాంతకుమారి, నాయకులు

జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రాజన్ రాజీనామా

జి.మాడుగుల: పాడేరు నియోజకవర్గం జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి కిల్లో రాజన్ బుధవారం పార్టీకి, తమ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కష్టించి పనిచేశానని, అనివార్య కారణాల వలన జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు పంపుతున్నట్టు ఆయన ప్రకటించారు.

19న నృసింహస్వామి తిరుకల్యాణోత్సవం

అనకాపల్లి : గవరపాలెం దిబ్బవీధి శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 19న స్వామి వారి తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ తెలిపారు. కల్యాణ గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని ఈనెల 19న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సింహాచలం దేవాలయంలో ఎటువంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారో అవన్నీ ఇక్కడ నిత్యం జరుగుతాయన్నారు. మే 10వ తేదీన జరిగే స్వామి వారి చందనోత్సవం (నిజ రూప దర్శనం) జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 2 గంటలకు మేలుకొలుపు, 2.30 గంటలకు స్వామి చందనం ఒలుపు, తెల్లవారు జాము 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు.

వైభవంగా భావన రుషేశ్వరస్వామి కల్యాణం

రాంబిల్లి: కొత్తపేట గ్రామంలో బుధవారం శ్రీ భద్రావతి సమేత భావనా రుషేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులు భద్రావతి సమేత భావనా రుషేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉపమాక రామాలయంలో సప్తాహం

నక్కపల్లి : మండలంలో ఉపమాకలోని కోదండ రామాలయంలో ఈనెల 17న జరిగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని సప్తాహం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏడురోజుల పాటు భజన బృందాలు నిరంతరం భజన గీతాలు ఆలపిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపమాక, ఉద్దండపురం, మంగవరం, కృష్ణాపురం గ్రామాలకు చెందిన భక్తులు ఆలపించిన భజన గీతాలు ఆకట్టుకున్నాయి. శ్రీరామ నవమినాడు సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.